# సాంబయ్య పెళ్లి

వాసిరెడ్డి సీతాదేవి

పుట్టి బుద్ధెరిగింతరువాత సాంబయ్య ఎన్నడూ ఆ రోజు ఉన్నంత సంతోషంగా లేడు. పుట్టుకురూపీ అష్టదరిద్రుడైన తనకు పిల్చి పిల్లనిస్తామనే వారున్నరని రుజువవటం బ్రహ్మానందాన్ని కలిగిస్తోంది సాంబయ్యకు.

సాంబయ్యకు ఈ ప్రపంచంలో నా అనేవాళ్లెవరూ లేరు. పుట్టినరోజే అమ్మ కరువయింది. అయిదో ఏడు వచ్చేటప్పటికి అయ్య పోయాడు. ఇక తన భారమంతా అరవై ఏళ్ల అవ్వ మీద వడింది.

అరవై ఏళ్ల ముసలి అవ్వ! పాపం, జీవితంలో మిగిలిన ఆ కొద్దిరోజులూ, కృష్ణా-రామా అంటూ కుక్కిమంచంలో గడపవలసిన దానికి ఇరుగుపొరుగు ఇండ్లలో అడ్డమైన చాకిరీ అంతా చేసి, ఇంత కూడు తినేలాగ చూడవలసిన భారం తానే మోయవలసివచ్చింది.

ఆ అవ్వా గతించింది. తను ఇంతవరకూ బ్రతుకును అలా భారంగా లాక్కువస్తున్నాడు. దరిద్రం, కురూపితనం.. కాని, ఈ నాడు...?

సాంబయ్య ఆవు పాలు పితికేందుకు కూర్చున్నాడు. అంత సంతోషంలోనూ అతనికి గతజీవితంలోని ఘట్టాలు స్ఫురణకు వస్తూనేవున్నాయి ఒక పీడకలలాగ.

వెనుక ఏదో చప్పుడైంది. వెంటనే వెన్నుపూస మీద తన్నినట్లు అమ్మగారి గర్జన "ఓరి నీ శిరసు మండా! ఏమిట్రా ఆవు కాళ్ల ముందు కూ...."

సాంబయ్య త్రుళ్లిపడ్డాడు. గబగబా పాలు పితకసాగాడు. అతని మనసు కళ్లెం లేని బలిసిన గుర్రంలాగ చెంగుచెంగున పరుగులు తీస్తూంది.

అవ్వ అతన్ని ఎన్నడూ బయటకు పోనిచ్చేది కాదు. ఒకవేళ ఖర్మం చాలక వెళ్లినా, తోటిపిల్లల్తో యెలా మెలగాలో అర్థమయ్యేది కాదు. పిల్లలు కూడా సాంబయ్యను తమ ఆటల్లో చేరనిచ్చేవారు కాదు. పైగా 'చెదల ముఖం' అంటూ గేలి చేసేవారు. చివరచివరకు బయటికి వెళ్లటం పూర్తిగా మానుకున్నాడు.

పాల తప్పాలతో వంటింటి వైపు నడుస్తున్నాడు.

యథాలాపంగా వెంకన్న వచ్చి తన మేనకోడల్ని ఇస్తానంటే తను నమ్మలేదు సుమా! అతికష్టం మీద చివరకు నమ్మవలసివచ్చింది.

రేపే పెళ్లి, తనింతవరకూ యే ప్రయత్నమూ చేయలేదు. కనీసం పెళ్లికూతురికి ఒక చీర అయినా కొనలేదు. జీతంలో రెండు రూపాయలు మాత్రం మిగిలివున్నాయి.

ఇలా ఆలోచిస్తూ పోతున్న సాంబయ్య కాలికి వంట యింటి గడప కొట్టుకుని బొక్కబోర్లా పడ్డాడు. ఆ శబ్దానికి ఇంట్లో వున్నవాళ్లంతా వచ్చి మూగారు. వంట ఇల్లంతా పాలమయం. సాంబయ్య రాబోయే ప్రమాదాన్ని ఊహించుకుంటూ, వణుకుతూ నిల్చున్నాడు ఒక మూల.

చౌదరిగారి భార్య మాలక్ష్మమ్మగారు ఇవ్వాళ ఏ గుణాన వున్నారోగాని, కోపానికి మారుగా జాలి కలిగింది సాంబయ్య మీద ఆమెకు. దగ్గరకెళ్లి అడిగింది, "ఏంరా, ఇవ్వాళ చాలా పరధ్యాన్నంగా వున్నావు? మీ అవ్వ గుర్తొచ్చిందా?"

"లేదమ్మగారూ!" ఏదో చెప్పబోయి సందేహిస్తున్నాడు సాంబయ్య. గుండె కొంతవరకు కుదుటపడింది.

"పరవాలేదు చెప్పు."

"అమ్మగారండీ మరే... రేపు... నాకు... పెళ్లి..." కటిక్కిన నాలుక కరుచుకున్నాడు.

మాలక్ష్మమ్మగారు ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. బహుశా ఆమెకు తన పెళ్లిరోజు గుర్తువచ్చి వుంటుంది. "అయితే నాకిన్ని రోజులూ చెప్పలేదేం?"

## ఒకరిని గురించి మరొకరు



సుస్మితాసేన్ పూజాబత్రా గురించి: పూజను చూడగానే ఎంతో ముద్దుగా వుందనుకున్నా. అలా తారాపథానికి ఎగిసిపోతుందనిపించింది. చేస్తున్న పనిలోని ఒత్తిడులూ, పరిశ్రమలోని రాజకీయాలూ పూజనే మాత్రం మార్చలేదు. ఆమె ఇంకా చిన్నపిల్లలాగే వుంది.

పూజాబత్రా: సుష్‌తో కాలక్షేపం చేయటమంటే నాకు చాలా ఇష్టం. తడుముకునే అవసరం లేకుండానే మాటలు వాటంతట అవే వచ్చేసేస్తుంటాయి. మేమిద్దరం వృశ్చికరాశి అమ్మాయిలం. మా ఇద్దరి తండ్రులూ సైన్యంలో వున్నందున, కుటుంబపరిస్థితులూ ఒక్కటే దాదాపుగా. అందువల్ల ఒకేలా పెరిగాము. స్నేహానికి ఇంతకంటే అర్హతలేమైనా కావాలంటారా?

కాని దీన్ని చివరిదాకా నిలుపుకోవటంలోనే వుంది గొప్పతనమంతా!

ఎస్.

> ఈ కథను ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 1952లో ప్రచురించాము

"నాలుగు రోజుల ముందు పిల్ల మేనమామ వచ్చి, శుక్రవారం మంచిలగ్నం వుందని చెప్పాడు" అన్నాడు సాంబయ్య.

మాలక్ష్మమ్మగారు ఏదో ఆలోచిస్తూ అడిగారు,"పిల్లను గురించి ఏమైనా అడిగావా?"

"లేదమ్మా!" అన్నాడు సిగ్గుతో తలవాల్చి.

"కొంపదీసి, ఏ కుంటిదో, గుడ్డిదో కాదుగదా?"

మాలక్ష్మమ్మగారి మాటలు చాకుల్లాగ గ్రుచ్చుకున్నాయి సాంబయ్య అమాయకహృదయానికి. ముఖం వెలవెలబోయింది. శుభమా అని పెళ్లి చేసుకోబోతుంటే ఈ శకునపక్షి దీవనలేంటి? సాంబయ్యకు బలే కోపం వచ్చింది. అతనికి జీవితంలో ఎప్పుడూ, ఎవరి మీదా ఇంత కోపం రాలేదు.

సాంబయ్య పరిస్థితిని అర్థం చేసుకున్న మాలక్ష్మమ్మగారు పలక్కుండా లోపలికి వెళ్లి వచ్చి, ఒక పదిరూపాయల నోటును సాంబయ్య చేతిలో పెట్టి అన్నారు, "ఇంక ఇంటికి వెళ్లు. ఈ రెండు రోజులూ పనిలోకి రావద్దులే."

బ్రతుకు జీవుడా అని, ఒక్క అంగలో బయటపడి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు సాంబయ్య.

ఇప్పుడు అతని దగ్గర మొత్తం పన్నెండు రూపాయలున్నాయి. కోమటి నరసయ్య గుడ్డల దుకాణంలోకి దూరాడు. పదిరూపాయలు పెట్టి పెళ్లికూతురికి ఒక నల్ల అంచు తెల్లచీర, ఒక ఎర్ర రవిక కొన్నాడు. మరి తనకో? రెండు రూపాయలు మాత్రం వున్నాయి. అతని అవస్థ తెలుసుకున్నట్లు నరసయ్య నవ్వుతున్నాడు. సాంబయ్యకు కోపం వచ్చింది. తనంటే ఈ ప్రపంచంలో అందరికీ అలుసే! పదిరూపాయల నోటు కోమటి చేతిలో వేసి, పైనున్న తుండులో గుడ్డలు చుట్టి, చంకలో ఇరికించుకుని బయలుదేరాడు.

నడుస్తుంటే సాంబయ్యకు రెక్కలు వచ్చినట్లూ, స్వేచ్ఛగా గాలిలోతేలిపోతున్నట్లూ వున్నది. సాలీలపేటకు చివరనున్న ఒక నిట్టాడి ఇంటి ముందు ఆగి, తడిక ఊడదీసి లోపల ప్రవేశించాడు. చంకనున్న గుడ్డలమూటను ఒక తుప్పు పట్టిన పాత రేకుపెట్టెలో భద్రపరిచాడు.

బాగా ఆకలేస్తున్నది అతనికి. ఇప్పుడు చెయ్యి కాల్చుకోవాలంటే కష్టంగా వుంది. ఈ ఒక్కరోజుకేగా ఈ కష్టం! రేపటి నుండి... హృదయంలో ఎవరో చక్కిలిగింత పెట్టినట్లున్నది. సిగ్గుతెరలు కమ్ముకుంటున్నాయి ముఖం మీద. ఒకదాని వెనుక ఒకటిగా ఏవో స్మృతులు తలలెత్తుతున్నాయి పుట్టగొడుగులులాగ.

అకస్మాత్తుగా అమ్మగారి ఆ పాపిష్టి మాటలు "కుంటిదో, గుడ్డిదో" గింగురుమన్నాయి సాంబయ్య చెవుల్లో. అతని హృదయం దెబ్బతిని క్రింద పడ్డ పక్షిపిల్లలాగ గిలగిల తన్నుకుంటున్నది. తను పడుకునివున్న మంచం ఎక్కడికో పాతాళానికి క్రుంగిపోతున్నది. రెండు చెవుల్లో చిటికెనవ్రేళ్లు దూర్చి, ఆ శబ్దం వినబడకుండా చేయప్రయత్నిస్తున్నాడు.

అవును. అంతే కావచ్చు. లేక తనలాంటి కురూపికి పిల్చి పిల్లనిస్తాననేదెవరు ఈ విశాలప్రపంచంలో? బుర్ర వేడెక్కింది. ఇంక ఆలోచించలేకపోతున్నాడు.

సాంబయ్య నల్లగా పొడవుగా వుంటాడు. కాళ్లూ, చేతులూ చాలా పొడవుగా వుంటవి. అతనికి తొమ్మిదవ ఏట మశూచికం వచ్చింది. అందులో ఒక కన్ను కాయ కాచింది. అసలు చచ్చిపోవాల్సిన దెబ్బ. ఎలాగో బ్రతికి బయటపడ్డాడు. ఆ నల్లని ముఖం మీద లోతైన గుంటలు, ఇనుము మీద త్రుప్పు పట్టినట్లు వుంటుంది.

అతనికి జ్ఞానం తెలిసినప్పటినుండి నడివీధిలో నలుగురి ముందూ తిరగటానికి, ఏదో తప్పు చేసినవాడిలా బాధ పడేవాడు. ఏ నలుగురు మాట్లాడుతున్నా, నవ్వుతున్నా సాంబయ్యకు తన గురించి మాట్లాడుతున్నట్లూ, తనను చూసి నవ్వుతున్నట్లూ అనిపించేది. అంతా తనను కావాలని పీడిస్తున్నట్లూ, తను మనుష్యుల మధ్య కాక ఏ అడవిమృగాల మధ్యనో వున్నట్లు భయపడేవాడు. సమాజంలో స్వేచ్ఛగా, నలుగురి ముందూ తలెత్తుకుని బ్రతకడానికి హక్కు లేనట్లు తోచేది సాంబయ్యకు. ఆ భావమే అతని హృదయంలో పెద్దయ్యేకొద్దీ బలీయంగా నాటుకుపోయింది.

ఇప్పుడు అతనికి ఇరవైయేడు యేళ్లు. ఇంతవరకూ చౌదరిగారి ఇల్లూ, తన ఇల్లూ తప్పితే వేరే ప్రపంచంతోనే సంబంధం లేదు అతనికి. అలా అని వయస్సుకు తగ్గ కోర్కెలు లేవని కాదు. ఇరుగుపొరుగున తన ఈడువాళ్ల పెళ్లిళ్లు జరుగుతుంటే, సాంబయ్య కూడా ఎన్నో పగటికలలు కనేవాడు. ఒక్కొక్కప్పుడు స్వప్నలోకంలో తన్ను తానే మరిచిపోయేవాడు. ఊహల్లోనే యెన్నో రాత్రులు హాయిగా గడిపేవాడు. ఉదయం లేవగానే తనకు పిల్లనిచ్చే దౌర్భాగ్యుడు కూడా ఈ ప్రపంచంలో వున్నాడా అని క్రుంగిపోయేవాడు. దొంగతనం చేసినవాడిలాగ ఆత్మగ్లానితో బాధపడేవాడు. కాని ఈ రోజు... తన కలలు నిజం కాబోతున్నాయి.


మరువలేని రుచి

హైటెక్

సాంబార్ & రసం పౌడర్

మిలినియమ్ కానుక




తయారు చేయువారు :

బి.ఎల్. సుజాత కాటేజి ఇండస్ట్రీస్,

సామరంగం చౌక్, విజయవాడ -1. ఫోన్ : 566957

ఏరియాల వారిగా స్టాకిస్టులు కావలెను.

RESEARCH MEDIA/BLI/V99

నిజం కలలంత మధురంగా వుండదని పాపం, ఆ అమాయికుడికేం తెలుసు?

తెల్లవారితే పెళ్లి. ఎన్నో ఊహలు ముసురుకుంటున్నాయి. తన భార్యను ఎలా సంతోషపెట్టాలి? తన అందవికారాన్ని ప్రేమతో మరుగుపరచగలడా? ఇలా ఆలోచిస్తూనే సాంబయ్యయే తెల్లవారుజాముకో నిద్రపోయాడు.

సాంబయ్య నిద్రనుండి లేచేప్పటికి బారెడు ప్రొద్దెక్కింది. త్వరగా వేడినీళ్లు పెట్టుకుని స్నానం చేశాడు. రాత్రి శుభ్రంగా ఉతికి ఆరవేసిన బట్టలు కట్టుకున్నాడు. రాత్రికి యేమైనా పండ్లు కొనటానికి బజారుకు బయలుదేరాడు.

త్రోవలో ఆలోచిస్తూ బండ్లకు, మనుష్యులకు ఎదురు నడిచినందుకు తిట్లు తిన్నాడు. ఒక మామిడిపండ్ల తట్ట ముందు ఆగి బేరం చేసి ఎక్కువ ధర చెప్పినందువల్ల కొనకుండా ముందుకు సాగాడు. బేరంచేసి కొనకుండా పోతున్నందువల్ల పండ్ల అమ్మి శాపనార్థాలు మొదలుపెట్టింది. అందులో ఎక్కువ భాగం తన కురూపితనానికే. సాంబయ్య కనీసం ఈ రోజునన్నా తన కురూపితనాన్ని మరిచిపోవాలని ప్రయత్నిస్తున్నాడు. కాని ప్రతివాళ్లూ ఈ విధంగా జ్ఞాపకం చేయటం అతని హృదయానికి బాకులు పొడిచి ఎత్తినట్లనిపించింది. "ఛీ, పాడు ప్రపంచం! పాడుమనుష్యులు. కనీసం ఈ రోజునన్నా తన కురూపితనాన్ని సానుభూతితో చూడకూడదూ?" సాంబయ్య కళ్లలో నీరు గిర్రున తిరిగింది.

ఒక మిఠాయి కొట్టు ముందు ఆగి, రెండు నూనె లడ్లూ, నాలుగణాల నూనె పకోడీలు కొని గబగబా నడుస్తున్నాడు. ఇంతలో "కుంటిదో, గుడ్డిదో" అనే శబ్దం చెవుల్లో... కళ్లు తిరుగుతున్నాయి. శరీరం భారంగా తోస్తున్నది. తడబడుతున్న కాళ్లు మాట వినటం లేదు.

"బాబూ! మీ కడుపు పండాలి. పదిమంది పిల్లల్ని కని చల్లగా వుండు బాబూ!" అని వినిపించింది సాంబయ్యకు రోడ్డుకు ఓ ప్రక్కనుండి. త్రుళ్లిపడి వెనుదిరిగి చూశాడు. తన్నేనా? అవును. తననే! దాదాపు ఇరవై సంవత్సరాల ఒక గుడ్డి అమ్మాయి ఐదుసంవత్సరాల ఒక పిల్లవాని చెయ్యి పట్టుకు నిల్చొనివున్నది. సాంబయ్య సంతోషంతో ఒక అణా ఆమె చేతిలో వేసి ముందుకు సాగాడు.

చివరకు తనను దీవించేవాళ్లు కూడా వున్నారు ఈ ప్రపంచంలో. కాదు, ఆ అమ్మాయి గుడ్డిది. అందువల్లనే తనను దీవించగలిగింది. తన రూపం చూస్తున్నంతవరకూ ఎవరూ దీవించలేరు, దీవించరు! గుడ్డివాళ్లు పైపై మెరుగులూ, రంగులూ చూసి ప్రేమించరు. వాళ్లు కోరేది హృదయం, రూపం కాదు. తన దగ్గర రూపం లేదు. హృదయం వున్నది. తనకు కాబోయే భార్య కుంటిది కాకుండా గుడ్డిదయితే... నిజంగాతను చాలా అదృష్టవంతుడే! ఇంతసేపూ భయపడ్డ తన తెలివితక్కువతనాన్ని నిందించుకున్నాడు.

సాంబయ్య ఇంటికి చేరేప్పటికే పిల్ల మేనమామ అతనికోసం ఎదురుచూస్తున్నాడు.

"నీకు పిల్లనిచ్చేదీ కాక ఎంతసేపు పంచలు పట్టుకుని పడుండాలి? బయలుదేరూ!" అన్నాడు విసుగ్గా.


సాంబయ్య ముఖం చిన్నపుచ్చుకున్నది. కిక్కురుమనకుండా లోపలకు పోయి ఒక్క నిమిషంలో చంకలో గుడ్డలమూటతో బయటకొచ్చాడు.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు. రెండు ఊళ్లకు మధ్య దూరం మూడు మైళ్లు. సాంబయ్యకు రెండు మూడుసార్లు పిల్ల విషయం అడగాలని నోటివరకూ వచ్చింది కాని ఆ పెద్దమనిషి ముఖవైఖరి చూస్తూ ధైర్యం చేయలేకపోయాడు.

ఊరు దగ్గరకు వస్తున్నది. గుండె వేగంగా


## నాకు కాజోల్ సాయం అక్కర్లేదు!

కాజోల్ అన్నఅంటే అలనాటి అందాల మేటినటి నూతన్ కుమారుడు మొహినీశ్‌బెహల్ అభిప్రాయమిది. 38 ఏళ్ల మొహినీశ్ ఇరవైఏళ్లుగా చిత్రాల్లో చిన్నవేషాలతోనే నెట్టుకొస్తున్నాడు. నూతన్ మరణించేముందే 'మైనే ప్యార్ కియా, హమ్ ఆప్‌కే హైం కౌన్' విడుదలయ్యాయి. "ఆ రోజుల్లో అమ్మ ఫిల్మ్ ఫేర్ అవార్డులు తీసుకునేందుకు వెళుతుంటే నేనూ ఆ ఫంక్షన్స్‌కు వెళుతుండేవాణ్ని. 'హమ్ ఆప్ కే..'కు ఉత్తమసహాయనటుడుగా నాకు అవార్డు వచ్చినప్పుడు నా పక్కనే అమ్మ వుంటే ఎంత బాగుండేదనిపించింది"



అంటున్నాడు మొహినీశ్. తల్లి పోయినా అమ్మమ్మ శోభనాసమర్థ్‌తో సత్సంబంధాలున్న మొహినీశ్‌కు, తన తల్లి చెల్లెలైన తనూజతోటీ, ఆమె కుమార్తే, తన చెల్లెలూ అయిన కాజోల్ కుటుంబంతోటీ రాకపోకలు లేవుట. అందుకే ఎవరో చెల్లెలు కాజోల్ సాయం తీసుకోవచ్చుగా కెరీర్ విషయంలోఅని ఇచ్చిన సలహాను తోసిపుచ్చాడు. కారణం అప్పటికి 'హమ్ ఆప్ కే..' విడుదలైంది. మరెప్పుడూ అలాంటి సాయం కోరాల్సిన పరిస్థితి రాదని అంటున్నాడు మొహినీశ్. అయినా తక్కువ ప్రతిభ గల నటుడేం కాదుమొహినీశ్. బ్రేవో మొహినీశ్!

ఎస్.



కొట్టుకుంటున్నది. కల నిజం కాబోతూంది. ఒకవేళ కుంటిదయితే? నడవలేకపోతున్నాడు.

ఇద్దరూ ఒక పూరి గుడిసె వైపు నడుస్తున్నారు. అదేనా అత్తవారి ఇల్లు? నడికప్పున ఆకుల్లేవు. ఎర్రమట్టితో కట్టిన ఆ చిన్నగోడలు అందులు పడిపోయివున్నవి. ఎంత జాగ్రత్తగా ఆ చిన్న వాకిలి నుండి లోపల ప్రవేశించ ప్రయత్నించినా ఆజానుబాహుడు సాంబయ్యకు దెబ్బతప్పలా. ఆ దెబ్బకు దిమ్మరపోయిన సాంబయ్య, పిల్ల మేనమామ చెయ్యి పట్టుకుని లాగి, కూర్చోపెట్టేంతవరకూ మామూలు స్థితికి రాలేదు.

ఎదురుగా కూర్చున్న పిల్ల పైన సాంబయ్య దృష్టి పడింది. ఆదుర్దాగా కళ్లవైపు చూశాడు. ఓరగా తననే చూస్తున్న ఆ పెద్దపెద్ద కళ్లు క్రిందకు వాలాయి సిగ్గుతో, మరి కాళ్లో?

ఇల్లు నాలుగు మూలలా కలియచూశాడు. పిల్చి పిల్లనిస్తామన్న కారణం అర్థమయింది. సాంబయ్య వాళ్ల ముందు తనెంతో మెరుగనుకున్నాడు. ఇంత దరిద్రులకు తనకంటె మించినవాడు ఎక్కడ దొరుకుతాడు? సాంబయ్యలో అహంభావం రేకెత్తింది. ప్రక్కన కూర్చున్న ఆ పెద్దమనిషి గొంతు నులిమేద్దామా అన్నంత కోపం వచ్చింది. ఈ భాగ్యానికేనా తనను ఇంత భయపెట్టాడు? పిల్ల కుంటిదయితే ఈ పెళ్లికి తను ఏ మాత్రం అంగీకరించడు. పిల్ల కుంటిదో కాదో తెల్సుకోవటం యెలా? ఒక ఉపాయం ఆలోచించి దీనవదనంతో ఒక మూల నిల్చొనివున్న ఆ పిల్ల తల్లిని మంచినీళ్లు అడిగాడు. ఆమె సాంబయ్య హృదయంలోని భావాన్ని గ్రహించినట్లు పిల్లకు సైగ చేసింది. వెంటనే లేచి మంచినీళ్ల కుండ వైపు నడిచింది పెళ్లికూతురు.

పిల్ల కుంటిదీ కాదు, గుడ్డిదీ కాదు. పెద్ద అందమైనది కాకపోయినా ఆకర్షణీయం గానే వుంది. సాంబయ్యకు అంతులేని సంతోషం కలుగుతూంది. అతనికిదంతా ఒక కలలాగ వుంది.

సాయంత్రం భోజనం చేసి సాంబయ్యా, అతని భార్యా బైలుదేరారు ఇంటికి ఒక ఒంటెద్దు బండిలో. ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. పిల్లను చూస్తున్నకొద్దీ సాంబయ్యకు తన కురూపితనం గుర్తుకొస్తున్నది. పిల్ల ముఖంలో విషాదచ్ఛాయలేమీ లేనందువల్ల సాంబయ్యకు కొంత తృప్తి కలుగుతోంది.

సాంబయ్య పిల్లతో మాట్లాడాలని ప్రయత్నించి కూడా, ఏమి మాట్లాడాలో తెలియక ఊరుకున్నాడు. ఆమె తనను చూడటం లేదనుకున్నప్పుడు చూసేవాడు. పొరపాటున ఇద్దరి కళ్లూ కలిసినవా, ఏదో విచిత్రసంకోచంలో పడేవాడు. కళ్లరెప్పలు వాటంతటవే సిగ్గుతో, బరువుగా వాలేవి. సర్దుకుని కూర్చునేవాడు.

దాదాపు రాత్రి ఎనిమిది గంటలకు బండి సాంబయ్య ఇంటి ముందు ఆగింది. అతను దిగి బండివాడికి కూలిచ్చి తడిక ఊడదీస్తున్నాడు. ఒకరి పిలుపుకు ఎదురుచూడకుండానే ఆ అమ్మాయి వచ్చి సాంబయ్య ప్రక్కనే నిలబడ్డది. ఇద్దరూ మౌనంగానే లోపల ప్రవేశించారు. కుక్కి మంచం వాల్చి ఆ అమ్మాయి కళ్లలోకి కూర్చోమన్నట్లు చూశాడు. ఇద్దరికీ సిగ్గు వేసింది. సాంబయ్యకు గొంతు పెకిలిరావటం లేదు. నాలుక ఆడదు, పెదిమలు కదలవు. తన అసమర్థతకు సిగ్గుపడుతున్నాడు. ఎలాగో ధైర్యం చేసి ఆ అమ్మాయి చెయ్యి పట్టుకుని కూర్చోపెట్టాడు. ఆ స్పర్శతో సాంబయ్య హృదయతంత్రులన్నీ ఒక్కమారుగా స్పందించాయి. అపూర్వమైన స్వర్గీయానందంతో ఊపిరాడటం లేదు. ఆ అమ్మాయి తలొంచుకుని కూర్చున్నందువల్ల ఆమెలో కలిగే భావోద్రేకాలను సాంబయ్య గ్రహించలేకపోతున్నాడు.

ఎలాగైనా ధైర్యం చేసి పలకరించాలి. ఒక్కసారి గట్టిగా సకిలించి గొంతు సరిచేసుకుని, వణుకుతున్న స్వరంతో అడిగాడు, "నీ పేరేంటి?"

ఆ అమ్మాయి అలానే తల వంచుక్కూర్చున్నది. ఈసారి ఇంకా కొంచెం ధైర్యంగా అడిగాడు. జవాబు లేదు. ఒకటికి నాలుగుసార్లు అదే ప్రశ్న వేశాడు. లాభం లేకపోయింది. సాంబయ్యకు కోపమొచ్చింది. తనంటే ఈ పిల్లక్కూడా అలుసే. బహుశా తన రూపం చూసి మాట్లాడబుద్ధి పుట్టటం లేదు లాగుంది.

కోపంతో మొరటుగా ఆ అమ్మాయి గడ్డం పట్టుకుని తల పైకెత్తుతూ గర్జించాడు, "నీ పేరేమంటే మాట్లాడవేం?"

ఆ అమ్మాయి విశాలనేత్రాల్లో నీరు క్రమ్మివుంది. ఆమె సన్నని శరీరం పెనుగాలిలోని లతలా కంపించిపోతున్నది. వణుకుతున్న చేతిని పైకెత్తి సైగ చేసింది 'తనకు మాటలు రావని...'

సాంబయ్య నెత్తిన పిడుగు పడ్డట్లయింది. గుండె బరువెక్కింది. కళ్ల ముందు చీకట్లు క్రమ్ముకుంటున్నాయి. రెండు చేతుల్తో జుట్టు పీక్కుంటూ "మోసం!" అంటూ గట్టిగా అరిచాడు. ప్రక్కన కూర్చుని రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకుని వెక్కివెక్కి ఏడుస్తున్న ఆ అమ్మాయి రెక్క పట్టుకుని బటబట బయటకు ఈడ్చి తడిక బిగించాడు.

మంచం మీద బోర్లాపడి వెక్కివెక్కి యేడుస్తున్నాడు. అలా ఎంతసేపు ఏడ్చాడో తనకే తెలియదు. హృదయం కొంచెం తేలికపడ్డది.

ఇంక ఆలోచించలేకపోయాడు. వెంటనే లేచి బయటకెళ్లాడు.

మనిషి అలికిడి కాగానే ఆ అమ్మాయి సాంబయ్య కాళ్లు గట్టిగా పట్టుకుని ముఖాన్ని పాదాల మీద వుంచి వెక్కివెక్కి ఏడుస్తూంది.

సాంబయ్య హృదయం తరుక్కుపోయింది. అతని కళ్ల నుండి కారే వేడినీళ్లు ఆ అమ్మాయి తలను తడుపుతున్నాయి. సాంబయ్య వంగి రెండు చేతుల్తో ఆ అమ్మాయిని పైకెత్తి హృదయానికి గాఢంగా హత్తుకున్నాడు.

(ఇది రచయిత్రి తొలికథ)



## రాముజీకి పక్షపాతం లేదు!

'ప్రేమ కథ' చిత్రానికి రామ్‌గోపాల్‌వర్మ అంతరామాలి అనే కొత్తమ్మాయిని హీరోయిన్‌గా తీసుకున్నారు. 'సత్య' చిత్రాన్ని ఎడిట్ చేస్తున్నప్పుడు స్టూడియో దగ్గర తన ఫోటోలు ఆయనకు చూపించిందిట అంతర. అంతకుముందు అంతర చేసిన రెండుచిత్రాల్లోనూ ఆమె నచ్చకపోయినా, రాము 'ప్రేమకథలో హీరోయిన్‌గా ఎంపిక చేశారు. అందుకనే అంతర "రాముజీకి ఊర్మిళంటే పక్షపాతమనీ, ఇంకెవరితోనూ అంత బాగా వుండరనీ అంటుంటారు. అదేం కాదు. నాతో కూడా బాగానే వున్నారు. ఆయన్ను గురించి ఇన్ని రకాల వదంతులు రావటానికి కారణం ఒకే హీరోయిన్‌తో ఏడేళ్లుగా చిత్రాలు తీయటమే!" అని తేల్చిపారేసింది! అయినా వాళ్లకిదేమీ తెలీదనుకుంటూందా ఏమిటో? అమాయకురాలు!

ఎస్.